ఉదయం పది గంటలు. రైలు దిగిన జనం టౌనులోకి ప్రవాహంలా వచ్చి పడుతున్నారు. ముఖ్యమైన నాలుగు రోడ్లూ స్థానికుల కంటే పొరుగూళ్ల జనంతోటే కిటకిటలాడుతున్నాయి. ఎంత కిటకిటలాడితే ఉదయం పూట టౌనుకు అంత కళ.

పావు గంటలో సందడి తగ్గిపోయింది. పెరుగు, పాలు అమ్ముకునే వాళ్ల టౌను నాలుగు మూలల్నీ ఆక్రమించారు. వెచ్చాల కోసం వచ్చిన వాళ్లు దుకాణాల మీద దాడి ప్రారంభిస్తే, కాగితాల కట్టల్ని హస్తభూషణంగా ధరించిన వ్యక్తులు కొందరు తాలూకా ఆఫీసును ఆశ్రయించారు. మరి కొందరు రిజిస్ట్రార్ ఆఫీసును పావనం చేశారు. ఒంటిగంట అయ్యేవరకూ వీధులకు విశ్రాంతి లభిస్తుంది.

తాలూకా ఆఫీసు నంటిపెట్టుకుని ఉన్న గవర్నమెంట్ హాస్పిటల్‌లోమాత్రం వాతావరణం భిన్నంగా ఉంది. హాస్పిటల్ ముందు వంతెన మీద సీసాలు పట్టుకుని ముఖాల్లో దైన్యాన్ని, అసహనాన్ని ప్రదర్శిస్తున్న రోగులూ, లోపల ఆవరణలో విడిచి ఉంచిన రెండు మూడు రెండెడ్ల బండ్లూ, రోడ్డు మీదికి కూడా విశేషంగా వ్యాపిస్తున్న మందుల వాసనా హాస్పిటల్‌కి అలంకారప్రాయములని కొత్త వ్యక్తి కయినా సులభంగా అర్థమైపోతుంది. క్రమశిక్షణ అలవడాలంటే ప్రతివాడూ కొన్నాళ్లు హాస్పిటల్లో గడపటం అవసరమేమో అన్నంత ప్రశాంతతకు, విభిన్నమైన మానవ ప్రవృత్తుల అధీనతకు ప్రతీకగా ఉంది.

'ఎట్లా ఉంది, డాక్టర్ గారూ? అబ్బాయికి జబ్బు తగ్గేనంటారా? నా కేందో భయంగా ఉందండీ! ఏం, డాక్టర్ గారూ?'

రోగికి ఇంజెక్షన్ ఇచ్చి వెళ్లిపోతున్న డాక్టర్‌ను ఊపిరాడకుండా ప్రశ్నలువేస్తూ, కన్‌సల్‌టేషన్ రూమ్ వరకూ నీడలా వెంటాడాడు దశరథరామయ్య. ఒక్క ప్రశ్నకూ సమాధానం చెప్పకుండానే కుర్చీలో కూర్చున్నాడు డాక్టర్ మాధవరావు. ఎదురుగా బెంచీమీద ఆసీనుడయ్యాడు దశరథరామయ్య. హృదయం భయంతో కొట్టుకులాడుతూంది. అయినా, కూర్చోవటంలో నీటు తగ్గలేదు.

బయట వంతెన మీద నిరీక్షణలో వ్యథ పడుతున్న రోగులు ఆరాటంగా పరుగెత్తుకొచ్చి, క్యూలో నిలుచున్నారు. వాళ్లని పరీక్షించి, ప్రిస్క్రిప్షన్ వ్రాసి ఇచ్చాడు మాధవరావు.

'ఏం, డాక్టర్‌గారూ, మాట్లాడరైతిరి! నా కేందో బెంగగా ఉందంటే!' దిగులు

'హస్పిటల్ కొచ్చిన తరవాత మీ రిలా
తొందరపడకూడదు. రోగులందరినీ నేనే
చూడాలిగా?' విసుగుపడ్డాడు మాధవ
రావు.

'చిత్తం! నిజమే ననుకోండి! ఆరాటం
కొద్దీ అడుగుతుండా!'
'ఇంతకు ముందు మీ అబ్బాయికి
జ్వరం తగిలింది కదూ?' సాలోచనగా
అడిగాడు మాధవరావు.

'అవును, డాక్టర్‌గారూ! పదేను దినాల క్రితం మామూలు జ్వరమే వచ్చింది. మా ఊరి ఆరెంపీ మామూలు జ్వరమే అన్నాడండి! ఏదో వాడి చేతనయిన వైద్యం చేశాడు. తగ్గిపోయింది. మళ్లా వారం దినాల నుంచి ఒకటే జ్వరం! ఆరెంపీ గాడేమో వాళ్లూరికి పారిపోయిండు. ఆశార్ల గారి ఆయుర్వేదం ఏం పనిచేయలేదండీ! పిల్లోడు పుల్లయ్యిండు. తమరే రక్షించాలి!' ప్రాధేయపడ్డాడు దశరథ రామయ్య.

అక్కర లేనిది కాబట్టే అలా సాగిలా మాట్లాడాడని గ్రహించాడు మాధవరావు. ఆరెంపీగాడట! డాక్టరంటే ఎంత చులకన! ఊరు విడిచి పారిపోవలసిన ప్రారబ్ధం ఎందుకు కలిగిందో? బహుశః దశరథరామయ్యే బెదరగొట్టి ఉంటాడు.

దశరథరామయ్య చెప్పిన తన కొడుకు





'అభిమన్య'

జ్వర విశేషాల కంటే, మిగతా మాటలే మాధవరావుగారిని బాగా ఆకర్షించాయి. గ్రామం సర్పంచ్‌ననే పొగరు అతని ప్రతి మాటలోనూ ధ్వనించింది.

'అయితే, దశరథరామయ్యగారూ! మీ ఊరి ఆరెంపీ ఎవరూ? వైద్యం చేత కాదా? లేక మీ గ్రామ రాజకీయాల్లో తలదూర్చి ఆసుపత్రి మూసేస్తున్నాడా?' కుతూహలంగా అడిగాడు మాధవరావు. కొడుకు రోగం మాట మరిచిపోయాడు దశరథరామయ్య.

'వాడి కంత తెలివి వాడుంది, డాక్టర్ గారూ! వైద్యం ఫరవాలేదు. హస్తవాసన్న ముండాకొడుకు. కాకపోతే, ఒక్కటే జబ్బు! చిన్నా పెద్దా యిచక్షణ లేదు బుద్ధి తక్కువోడికి.' దశరథరామయ్య కళ్ళ కోపంతో మెరిశాయి. మాధవరావుకు పుండు మీద కారం చల్లినట్లయింది. అయినా, బయటపడదలుచుకోలేదు. నవ్వుతూనే అన్నాడు:

'రోగానికి చిన్నా పెద్దా ఉండదు, దశరథరామయ్యగారూ! మీ విషయమే ఆలోచిద్దాం—ఎంతో గాభరాతో తీసుకొచ్చి మీ అబ్బాయి నిక్కడ జేర్చారు. గంట క్రితమే మన తాసీల్దారుగారు వాళ్ళ అమ్మాయిని తీసుకొచ్చారు. నాలుగు రోజులనుంచి ఇంటి దగ్గరే చూస్తూ మందిస్తున్నా ననుకోండి! ఈ వేళ్టికి తేలింది టైఫాయిడ్ అని.' సిగరెట్ వెలిగించాడు మాధవరావు.

'తాసీల్దారుకు ఆసుపత్రికి తేవం వొచ్చిందండే!' ఆశ్చర్యం ప్రకటించాడు దశరథరామయ్య, ముఖం చిట్లించి.

'ఆ అమ్మాయి కొంచెం మొండి ఘటం! మంచం మీద పడుండే రకం కాదు. ఇక్కడయితే నర్సుల భయానికి కదలకుండా పడుకుంటుందని నేనే చేర్పించమన్నాను. అసలు చెప్పొచ్చిం దేమిటంటే మీ అబ్బాయికీ టైఫాయిడ్ ...'

'ఆఁ! ట ... టేపాయిడ్డా? అంటే... సన్నిపాత రోగం! అమ్మో! గుణంపుడద్దో ఏం పాడో!' దశరథరామయ్య గజగజలాడిపోయాడు.

'కాస్త సీరియస్! అంటే కొంచెం ప్రమాదకరం! అబ్బాయిని ఆలస్యంగా తీసుకొచ్చారు. మీ వాణ్ణి చూడగానే, తాసీల్దారుగారి అమ్మాయిని అలాగే వదిలేసి వచ్చేశాను. ఎందుకో తెలుసా?' సిగరెట్ పొగ శూన్యంలోకి ఊదుతూ అన్నాడు మాధవరావు.

'అర్జెంటు కేసని.' ఠకీమని జవాబు చెప్పాడు దశరథరామయ్య.

'కరెక్టు! చిన్న మనుషులకు పెద్ద రోగాలూ, పెద్దవాళ్ళకు చిన్న రోగాలూ రాకూడదని రూలేం లేదుగా?'

'మీ రందీ కరెక్టే, డాక్టర్ గారూ!' చచ్చినట్లు ఒప్పుకున్నాడు.

'మీ అబ్బాయికి ఏం ప్రమాదం లేదు. ఈ రోజుల్లో టైఫాయిడ్‌ను నయంచేయటమంటే, జలుబు తగ్గించినంత సులభం! మీవాడి విషయంలో మాత్రం నాలుగు రోజులు ఆలస్యం! మందూ మాకూ లేకుండా రోగం ఎక్కువ చేశారు. పైగా, అడ్డమయినవన్నీ తినిపించి ఉంటారు!' కసిరినట్లు అన్నాడు మాధవరావు.

'తమ దయ! నాల్రోజులు కాదు, నెల్లాళ్ళు ఆలసమయినా ఇబ్బందిలేదు. మావోడు మల్లా మనిషయితే చాలు. తమ కేదో ముట్టజెప్పుకోకపోను.' లౌకికం ప్రదర్శించాడు దశరథరామయ్య.

'నేను గవర్నమెంట్ డాక్టర్ని! ముట్టజెప్పటాల మూర్ఖపు మాటలు నాదగ్గర రానివ్వద్దు. జాగ్రత్త!' కళ్ళ ఎర్ర జేశాడు మాధవరావు.

'చిత్తం! అలవాటుగా నాలిక దొర్లిపోయింది! మా ఊరికి సరుపంచిని కదండే, ఏదో లాబం చూపకపోతానూ!'

మూతి మీసాలు కిందికీ, మీదికీ ఊగినాయి — దశరథరామయ్య చిందించిన చిరునవ్వుకు తట్టుకోలేక.

ఆ దృశ్యం చూడలేక మాధవరావు వార్డులోకి వెళ్ళిపోయాడు. దశరథ రామయ్య ముఖం చిన్నబోయింది.

● ● ●

వారం రోజులు చాలా భారంగా దొర్లిపోయాయి దశరథరామయ్యకు. కొడుక్కు సేవజేస్తూ, హాస్పిటల్‌లోనే జరిగే తతంగమంతా నిశితంగా పరిశీలించాడు. డాక్టర్ మాధవరావు మంచి వా డనే సదభిప్రాయం కలిగింది. ఆయనకు రోగం ముఖ్యంగానీ, రోగి కాదు. సమయం పడితే రోగి దగ్గర—వాడు రిక్షా వాడయినా, రోడ్డు కూలీ అయినా—తెల్లవార్లూ కూర్చునే వాడు. తాసిల్దారుగా రమ్మాయిని అయిదు నిమిషాల కంటే ఎక్కువ పరీక్ష చెయ్యని సందర్భాలున్నాయి.

హాస్పిటల్ ఎదురుగా ఉన్న 'ఉడిపి' హోటల్లో కాఫీ సేవిస్తున్న దశరథ రామయ్య మనస్సెందుకో చివుక్కుమంది. ఆరెంపీ సుబ్బారావు కళ్ళలో మెదిలాడు. ముఖం దీనంగా ఉంది. చిన్న పిల్లాడిలా ఏడుస్తున్నాడు. చొక్కాతో కన్నీళ్ళు తుడుచుకుంటున్నాడు. వయస్సు ఇరవై రెండుకు మించదు. ఇంకా పెళ్ళికాలేదు.

పదిహేను రోజుల క్రితం తన కొడుక్కి జ్వరమొచ్చింది. ఒళ్ళు మాడిపోతూంటే ఆదుర్దా పొందాడు తను. రాత్రి ఎనిమిది గంటలు టైమయింది. సుబ్బారావును అర్జెంటుగా రమ్మని పాలేరుతో కబురు పెట్టాడు. ఆ సమయానికి సుబ్బారావు వడ్డెరపాలెంలో బాలిగాడి కొడుక్కి మందిస్తున్నాట్ట. అపథ్యం జేసినందువల్ల బాలిగాడి కొడుక్కి టైఫాయిడ్ తిరగబెట్టింది.

'ఇప్పుడు రావటానికి వీల్లేదు. తెల్లవారిన తరవాత వచ్చి చూస్తాలే! దశరథ రామయ్య గారితో చెప్పు' అని పాలేరును వెనక్కి పంపాడు. తనకు ఒళ్ళు తిమ్మిరెక్కిపోయింది. ఎంత తల బిరుసు! కళ్ళు నెత్తికెక్కినాయి ఆరెంపీ గాడికి! వడ్డెర బాలిగాడి కొడుకు ముఖ్యమా, గ్రామ సర్పంచ్ కొడుకా? వెధవకి — చిన్నా పెద్దా తారతమ్యం తెలియదు. తను తలుచుకుంటే వాడి గతేమిటి? తెల్లారాక వస్తానని బోడి కబురంపుతాడా? వాడి మదం అణగ్గొట్టాలె! లేకుంటే దారికి రాడు!

కొడుకు మూలుగుతూనే ఉన్నాడు. కాలు గాలిన పిల్లిలా ఇల్లంతా తిరిగాడు దశరథరామయ్య. మనసంతా తుకతుక లాడిపోతూంది!

'ఒరేవ్, పోలాయ్ ...' వరండాలో కొచ్చి గావుకేక బెట్టాడు. పాలేరు పోలయ్య ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు, కాలుతున్న చుట్టను గిరాటేసి.

'బాలిగాడింటికి పోదాం పద! ఆరెంపీ గాడి పని అక్కడే చెబుతా!' బుసలు కొట్టాడు దశరథరామయ్య.

పోలయ్య కిక్కురుమనలేదు. కర్ర తీసుకుని దశరథరామయ్య ననుసరించాడు.

బాలిగా డింటి గడప తొక్కుతూనే— 'ఏమయ్యా, బుద్ధి తక్కువోడా! అర్జెంటుగ రమ్మని కబురంపిస్తే, రే పొస్తానని జవాబు పంపినవు?' అంటూ అక్కడి జనాన్ని హడలగొట్టాడు.

'ఇదీ మరీ అర్జెంటు కేసు, రామయ్య గారూ! తెల్లవారితేగాని వీడికి గండం తప్పదు.' నమ్రతగానే చెప్పాడు సుబ్బారావు.

'అంత అర్జెంటా? ఎంతర్జెంటేం?' పిడికిళ్ళు బిగించి మీది కురికాడు దశరథ రామయ్య.

'ఇక్కడ గోల చెయ్యద్దు దయచేసి. రోగి ప్రమాదస్థితిలో ఉన్నాడు.' కొంచెం కటువుగా అన్నాడు సుబ్బారావు.

'నీ బొంద కదూ! బుద్ధిలేనినాయాల.' సుబ్బారావు చెంప ఛెళ్ళుమని మోగింది. దశరథరామయ్య కుడిచేతి అయిదు వేళ్ళూ ముద్రపడిపోయినాయి, క్రూరత్వానికి నిదర్శనగా. సుబ్బారావు కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. ఆ పరిస్థితిలో బాలిగాడు కల్పించుకోక తప్పలేదు. పౌరుషం వరదలా పారింది!

'ఎంత సర్పొంచివయితే మాత్తరం, డాటర్ గోరి పైన సెయి జేసుకుంటవ, రామయగోరూ? నా పిల్లోడు సావు బతుకుల్లో ఉండడు. ఈడినుంచి మరియాదగ ఎల్లిపొండి. డాటర్‌గోరు ఇప్పుడు యాడకీ రారు' అన్నాడు కళ్ళలో నిప్పులు చెరుగుతూ.

పోలయ్య సైగచెయ్యటంతో,



ఒంటరి
ఫోటో— వి. శ్రీనివాసరావు (హన్మకొండ)

